ప్రజాశక్తి

బుధవారం 10 డిసెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మెట్రో తెల్ల ఏనుగే..!

- తెరపైకి డబుల్ డెక్కర్ !
- రూ.వేల కోట్ల ఖర్చుతో మెట్రో రైల్ ప్రాజెక్టు వెనకడుగు
- 'కూటమి'లో కొరవడిన ఆసక్తి...
- 50-50 నిష్పత్తిలో నేషనల్ హైవే మెట్రో కార్పొరేషన్‌కు పనులు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అంతా ఊహించినట్టుగా విశాఖ మెట్రో రైల్ ఎట్టకేలకు 'తెల్లఏనుగే' అని తేలింది. అంటే విశాఖ నగరాన్ని ఏళ్లతరబడి పట్టిపీడిస్తున్న ట్రాఫిక్ సవాల్‌ను ప్రజలు ఎదుర్కొనాల్సిందే.! వైజాగ్ మెట్రో అంటూ కూటమి పాలకులు 2024 ప్రారంభంలో తెగ ప్రచారం చేశారు. గడచిన కొన్ని నెలలుగా దీని ఊసేలేదు. గత వైసిపి ప్రభుత్వం దీనిపై హడావుడి చేసి చతికిలపడింది. తాజాగా రూ.వేల కోట్ల ఖర్చును భరించేందుకు ఏ కన్సల్టెన్సీ ముందుకు రాకపోవడంతో చంద్రబాబు ప్రభుత్వం తమ విధానాన్నే మార్చుకోవాల్సి వచ్చింది. బీజింగ్ ప్రధాన కార్యాలయం కలిగిన ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు (ఎఐఐబి) వైజాగ్ మెట్రో కార్పొరేషన్ (విఎంసి)కి 60శాతం ఆర్థిక సహాయం ఇచ్చేందుకు సిద్ధమైందంటూ కూటమి నేతలు ప్రచారం చేశారు. మిగిలిన 40శాతం రాష్ట్రం (20శాతం), కేంద్రం (20శాతం) మెట్రోకు ఇవ్వాల్సి ఉండగా ఒక్కపైసా కూడా కేటాయించలేదు. దీంతో తెరపైకి తాజాగా డబుల్ డెక్కర్‌ను కూటమి ప్రభుత్వం తెస్తోంది.

'డబుల్ డెక్కర్' ఆచరణ సాధ్యమేనా?

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, విశాఖ జిల్లా అధికార యంత్రాంగం, విఎంఆర్‌డిఎ సంయుక్తంగా 'వైజాగ్ మెట్రో'కు బదులుగా 'డబుల్ డెక్కర్' దిశగా ఆలోచనలు సాగిస్తున్నాయి. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ), వైజాగ్ మెట్రో కార్పొరేషన్ (విఎంసి) సంయుక్తంగా 50-50శాతం పద్ధతిలో నిధులను వెచ్చించేందుకు సిద్ధమవుతున్నాయి. 46.23 కిలోమీటర్ల దూరానికి రూ.11,498 కోట్లు మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఖర్చుకానుండడంతో ఇంత నిధులు పూలింగ్ సాధ్యపడలేదని తెలుస్తోంది. దీంట్లో సగానికి లోపే ఖర్చయ్యేలాగ పొడవాటి డబల్ డెక్కర్ రైలు ఏర్పాట్లలో వైజాగ్ మెట్రో కార్పొరేషన్ ప్లాన్ చేస్తోంది. ఈ కొత్త ప్రతిపాదనలను రాష్ట్రానికి, కేంద్రానికి పంపినట్లు సంబంధిత అధికారులు తాజాగా చెబుతున్నారు.

ఒకపక్క భోగాపురం రెడీ...

భోగాపురం ఎయిర్ పోర్టు సిద్ధం అవుతుండడంతో అధికార యంత్రాంగంలో ఆందోళన మొదలైంది. అనకాపల్లి, సబ్బవరం మీద నుంచి వచ్చేవారు మినహా విశాఖ నగరం, గాజువాక నుంచి బయల్దేరి భోగాపురం వెళ్లాలనుకుంటే వారి పని ట్రాఫిక్‌లో పడి కొట్టుకోవాల్సిందే. డబల్ డెక్కర్ రైలు పైనుంచి, బస్సులు ఇతర వాహనాలు కింది నుంచి వెళ్లేలా తాజా ప్లాన్

మిగతా 2లో..

నేటి నుంచి టెట్

- పరీక్ష రాయనున్న 26,248 మంది అభ్యర్థులు
- వివరాలు వెల్లడించిన డిఇఒ ప్రేమ్‌కుమార్

టెట్ పరీక్ష వివరాలు వెల్లడిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలోని 12 కేంద్రాల్లో బుధవారం నుంచి 21వ తేదీ వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై వివిధ విభాగాల అధికారులతో మంగళవారం కలెక్టరేట్ విసి హాలులో సమీక్షించిన ఆయన పలు వివరాలను వెల్లడించారు. విశాఖపట్టణం జిల్లాలో 11 కేంద్రాలుండగా, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో ఒక కేంద్రం ఉందన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులతో కలిసి మొత్తం 26,248 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు వివరించారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు పూటలా పరీక్ష ఉంటుందని చెప్పారు. పరీక్ష నిర్వహణలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని, సజావుగా జరిగేలా సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, తాగునీటి సదుపాయం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆయా రూట్లలో పరీక్ష సమయానికి అనుగుణంగా బస్ సర్వీసులను నడపాలని సంబంధిత అధికారులకు చెప్పారు. 12 కేంద్రాల్లో కలిపి మొత్తం 121 మంది స్రైబ్స్ ఉన్నారని, దానికి తగ్గట్లు ఏర్పాటుచేసుకోవాలని ఆయా కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. పర్యవేక్షణకు అధికారులను నియమించామని, డిఇఒ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్కు కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. అధికారులు గానీ,పరీక్ష రాసే అభ్యర్థులు గానీ సహాయం కోసం 9177292969, 9618584051, 8328524861 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఎడి జి.గోపీకృష్ణ, ఆర్ఐఒ చంద్రశేఖర్, డిప్యూటి డిఇఒ సోమేశ్వరరావు, ఐ అండ్ పిఆర్, విద్యుత్, పోలీసు, వైద్యారోగ్య, ఆర్‌టిసి, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

జెన్ జెడ్ థీమ్ పోస్టాఫీస్ ప్రారంభం

వార్త 2లో..

యుటిఎఫ్ టెన్త్ మోడల్ పేపర్లు ఆవిష్కరణ

వార్త 4లో..

13న ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వార్షిక సమావేశం

వార్త 2లో..

14న నేవీ మారథాన్

వార్త 2లో..

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- విశాఖపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో ఈ నెల 12వ తేదీన పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి మధురవాడ ఐటీ హిల్స్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను గమనించారు. కాగ్నిజెంట్ కంపెనీకి శంకుస్థాపన చేయనున్న ప్రాంతంలో, విఇఆర్ (వైజాగ్ ఎకనామిక్ రీజియన్) సమావేశం జరగనున్న ప్రాంతాల్లో అధికారులతో మాట్లాడారు. ఏర్పాట్లు ఎక్కడివరకు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. సమయం తక్కువ ఉన్నందున అధికారులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం హిల్ నెంబర్3 వద్దకు నేరుగా ముఖ్యమంత్రి చేరుకోకున్న క్రమంలో అక్కడ హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి అధికారులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విశాఖ బాలోత్సవం

బాలోత్సవం ప్రారంభంలో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వరుసగా మూడోసారి నిర్వహిస్తున్న విశాఖ బాలోత్సవం మంగళవారం స్థానిక సెయింట్ ఆంథోనీ తెలుగు మీడియం ప్రైమరీ స్కూల్లో మంగళవారం ప్రారంభమైంది. ఈ పిల్లల పండగను జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంతమంది పిల్లలను ఒకే చోట చూడటం ఆనందంగా ఉందన్నారు. పిల్లలు అందరిలో ఆనందం కనిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న వివిధ పోటీలలో పాల్గొనే బాలలలో ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధమైన ప్రతిభ ఉంటుందని, వారి టాలెంట్ ఆధారంగా ప్రోత్సహించాలని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులకు సూచించారు. ఒకరి టాలెంట్‌తో మరొకరిని పోల్చవద్దన్నారు. ఇంత చక్కటి కార్యక్రమానికి పాఠశాల ఆవరణను ఇచ్చిన ఫాదర్ పి.రత్నకుమార్‌ను, ఇంత పెద్ద ఎత్తున బాలోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.

పలు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోటరీ ఇంటర్నేషనల్ 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ, రోటరీ సేవాభావంతో ప్రపంచవ్యాప్తంగా పని చేస్తుందన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇంటరాక్ట్ క్లబ్స్, యువకులను ప్రోత్సహిస్తూ రోటరాక్ట్ క్లబ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ కార్యక్రమాలలో పాల్గొనే పిల్లలలో కొత్త టాలెంట్ వెలుగు చూస్తుందన్నారు. ఇటువంటి కార్యక్రమానికి పిల్లలను తీసుకువచ్చిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. డిజిటల్‌లో ఆసక్తి చూపుతున్న పిల్లలకు

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మెట్రో తెల్ల ఏనుగే..!

తయారవుతోంది.

10 జంక్షన్ పాయింట్లతో

ఈ డబుల్ డెక్కర్ ప్రాజెక్టు పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం నుంచి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వరకూ 10 జంక్షన్ పాయింట్లతో వెళ్లేలా కారిడార్‌ను ప్లాన్ చేస్తున్నారు. 46 కిలోమీటర్ల మొత్తం కారిడార్‌లో సుమారు 26 కిలోమీటర్ల వరకూ తొలి దశలో ఉండబోతుంది.

గత డిపిఆర్ వెనక్కి...

విఎంఆర్‌డిఎ పై ఓవర్‌లు, రోడ్ల అభివృద్ధిలో పలు సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటుంది. నిధుల కొరతతో గత డిపిఆర్ వెనక్కి వెళ్లినట్లే. మాస్టర్ ప్లాన్ రోడ్ల వివాదాలు స్థానికుల వ్యతిరేకత, టిడిఆర్‌ను అందజేయాలన్న డిమాండ్లు, డిజైన్లపై అభ్యంతరాలు కొనసాగుతున్నాయి. గతంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో 10కి పైగా రోడ్లను సుమారు రూ.1500కోట్లతో విఎంఆర్‌డిఎ ప్రతిపాదించినా అమలుకు నోచుకోలేదు. దీంతో నగరంలో వాహనాల సంఖ్య పెరగడంతోపాటు ట్రాఫిక్ సమస్య నానాటికీ తీవ్రం అవుతోంది. పరదేశిపాలెం నుంచి గాజువాక వరకూ 10 పై ఓవర్లను, అనకాపల్లి పరిధిలో ఒక పై ఓవర్‌కు తయారైన డిపిఆర్ వెనక్కి వెళ్లినట్లే అయ్యింది. డబుల్ డెక్కర్ అయినా ఆచరణలోకి వస్తుందా? సాధ్యాసాధ్యాలపై తాజాగా చర్చ సాగుతోంది.

ఉత్సాహంగా విశాఖ బాలోత్సవం

ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఏ కార్యక్రమం విజయవంతం కావాలన్నా టీం వర్క్ ముఖ్యం అని చెప్పారు. మైనర్లకు స్కూటర్లు ఇచ్చి ప్రోత్సహించవద్దన్నారు. మాదకద్రవ్యాలకు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. ఫాదర్ పి.రత్నకుమార్ మాట్లాడుతూ, ఇంత మంచి కార్యక్రమానికి తమ పాఠశాల ఆతిథ్యం ఇవ్వటం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ పికె.జోష్ మాట్లాడుతూ, పిల్లలకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఆసరా చారిటబుల్ సొసైటీకి చెందిన శ్రీనాథ్ మాట్లాడుతూ, పిల్లలు తమ చుట్టూ జరిగే వాటిని పరిశీలించాలన్నారు. రోటరీ విశాఖ వ్యాలీ చైర్మన్ ఎవి.జానకిరామ్, బాల వికాస ఫౌండేషన్ చైర్మన్ నరవ ప్రకాశరావు, బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు, ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు, ఆహ్వాన సంఘం సభ్యులు దంధు నాగేశ్వరరావు, డాక్టర్ కె.రమాప్రభ, కె.సుశీల, ఎం.ఎల్లాజీ, ఎం.శశికుమార్, మోదాంబికా దేవి తదితరులు పాల్గొన్నారు. మొదటిరోజు 27 అకడమిక్, కల్చర్ కార్యక్రమాలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ కేటగిరిలలో పోటీలను నిర్వహించారు.

అవినీతిపై ఉక్కుపాదం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : జివిఎంసిలో అవినీతి రహిత విధానం అమలు దిశగా కఠిన చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. జివిఎంసిలో ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే పలు ఆరోపణలపై ఒక ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సేవలను సరెండర్ చేశామని, ఒక సహాయక ఇంజినీర్‌పై విచారణకు ఆదేశాలు జారీ చేసామని, ఒక టిపిఒ సేవలను కూడా సరెండర్ చేసినట్లు పేర్కొన్నారు. పౌర సేవల్లో పారదర్శకత, నిష్పాక్షికత కోసం జివిఎంసి ఎటువంటి అవినీతి చర్యలనూ ఉపేక్షించదని కమిషనర్ స్పష్టం చేశారు. జివిఎంసి అధికారులు, ఇంజినీర్లు, ఉద్యోగులు, సిబ్బంది అవినీతి రహితంగా, విశాఖ నగర అభివృద్ధి దిశగా చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ, ప్రజలకు సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

14న నేవీ మారథాన్

ఏర్పాట్లకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నేవీ డే వేడుకల్లో భాగంగా ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన 10వ ఎడిషన్ వైజాగ్ నేవీ మారథాన్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ మీటింగు హాలులో కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ మారథాన్‌లో 17 దేశాల నుంచి 17,500 ఔత్సాహికులు భాగస్వామ్యం కానున్నారని, ఈ మేరకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. వెయ్యి మంది సిబ్బంది, 2000 మంది వాలంటీర్లు సేవల్లో నిమగ్నమవుతారని చెప్పారు. 42 కిలోమీటర్లు, 21 కిలోమీటర్లు,10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల విభాగాల్లో పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు. మారథాన్ ఆర్‌కె.బీచ్ వద్ద ప్రారంభమై విశాఖ తీరప్రాంతం వెంబడి కొనసాగుతుందన్నారు. పాల్గొనే వారికి అవసరమైన పార్కింగ్, హైడ్రేషన్ పాయింట్లు, వైద్య సేవలు తదితర ఏర్పాట్ల విషయంలో జిల్లా అధికారులు, నేవీ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ప్రతి రన్నర్‌కు డ్రై-ఫిట్ టీషర్ట్, నేవీ థీమ్ మెడల్, గూడీ బ్యాగ్, అల్పాహారం అందజేయాలని చెప్పారు. ఇతర ఏర్పాట్లు పక్కాగా చేయాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సూచించారు. శారీరక దృఢత్వం, సముద్ర అవగాహనతో పాటు నేవీ డే వేడుకల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే ఈ మారథాన్ ప్రధాన లక్ష్యమని ఈస్టర్న్ నేవల్ కమాండ్ అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమావేశంలో కెప్టెన్లు టిఆర్ఎస్ కుమార్, వినోత్ తివారీ, కమాండర్ కిశోర్, లెఫ్టినెంట్ కమాండర్లు పి.మోహంత్ నాయుడు, నరేశ్, ఎడిసి రమణమూర్తి, ఇపిడిసిఎల్ ఎస్ఇ శ్యాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

13న ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వార్షిక సమావేశం

ముఖ్య అతిథిగా హాజరు కానున్న మూర్తి ట్రస్ట్ చైర్‌పర్సన్ సుధామూర్తి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల వార్షిక సమావేశం వేవ్స్ 2025 ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్నట్లు సంఘం చైర్మన్ కెవివి.రావు తెలిపారు. మంగళవారం ఎయు ఆలుమ్ని జిఎంఆర్ సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మహిళా సాధికారత థీమ్‌తో ఈ సంవత్సరం ఆలుమ్ని సమావేశం వేవ్స్-2025ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న రాజ్యసభ సభ్యులు, రచయిత, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మూర్తి ట్రస్ట్ చైర్‌పర్సన్ సుధా మూర్తి హాజరవుతారని తెలిపారు. విశ్వవిద్యాలయం వందేళ్ల వేడుకలను జరుపుకుంటున్న సమయంలో ఈ కార్యక్రమం మరింత ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. కార్యక్రమంలో ఎయు ఆలుమ్ని వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జిఎం.రావు తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి 10 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ప్రధాన వేదికలతో పాటు ప్రాంగణం వెలుపల ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఎయు ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ వార్షిక పూర్వవిద్యార్థుల సమావేశానికి వర్సిటీ పరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల వార్షిక సమ్మేళనం వేవ్స్ -2025 కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను విసి రాజశేఖర్, ఆలుమ్ని చైర్మన్ కెవివి రావు కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజా, జనరల్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్, ఇసి సభ్యులు డాక్టర్ ఎస్‌కె అప్పారావు, ఆచార్య బి.మోహన వెంకట రామ్, వైవి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సమతలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ఐఐఎంఎం డైరెక్ట్ జనరల్ వి.కృష్ణమోహన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమత కళాశాలలో బి.కాం, బిబిఎ ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐఎంఎం డైరెక్ట్ జనరల్ వి.కృష్ణమోహన్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశలో కెరీర్‌ను ఉన్నతంగా మలుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాల డీన్, కరస్పాండెంట్ డాక్టర్. ఎస్.విజయరవీంద్ర మాట్లాడుతూ మంచి ప్రవర్తనతో, తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని, కళాశాల నిబంధనల పాటిస్తూ, క్రమశిక్షణతో ఉండాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్ ప్రొఫెసర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, కళాశాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే వేదిక, కొత్త స్నేహాలు ఏర్పడే చోటు, ప్రతిభను వెలికితీసే కేంద్రం అని చెప్పారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలు, డాన్సులతో అలరించారు. ఈ కార్యక్రమంలో బికాం, బిబిఎ విభాగ అధిపతులు ఎ.వి. కోటేశ్వరరావు, వి.అనిత, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

జెన్ జెడ్ పోస్టాఫీసును ప్రారంభిస్తున్న విసి

జెన్ జెడ్ థీమ్ పోస్టాఫీస్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులు, పరిశోధకులు క్యాంపస్ అధికారులకు ఆధునిక తపాలా సేవలను మరింత చేరువ చేయడానికి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అత్యాధునిక జెన్-జెడ్ థీమ్ పోస్టాఫీస్‌ను మంగళవారం ఎయు విసి ప్రొఫెసర్ జిపి.రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తొలి జెన్ -జెడ్ పోస్టాఫీస్ ఎయులో ఏర్పాటుచేయడం గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. థీసిస్, ప్రాజెక్టులు సిద్ధం చేసే విద్యార్థులకు కెరీర్ అభివృద్ధి కోసం ఆలోచనలను పంచుకునే వారికి ఇది ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతపు తపాలా పోస్ట్‌మాస్టర్ జనరల్ విఎస్.జయశంకర్ మాట్లాడుతూ, భారత తపాలా వ్యవస్థ ఆవిష్కరణ, అందుబాటును పెంపొందించేందుకు కట్టుబడి ఉందని, విద్యార్థులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ జెన్ -జెడ్ పోస్టాఫీస్‌లో ఆధునిక సాంకేతికతను సంప్రదాయ తపాలా సేవలతో సమన్వయం చేస్తూ, డిజిటల్-ఫ్రెండ్లీ కౌంటర్లు, వేగవంతమైన పార్సిల్ సేవలు, విద్యార్థి కేంద్రిత పరిష్కారాలు, మెరుగైన కస్టమర్ అనుభవాన్ని అందిస్తాయని చెప్పారు.

CHANGE OF NAME

I, **Seeramsetti Peda Eswararao,** S/o. Seeramsetti Demudu, aged, 59 years, residence of Marripalem, Boduvalasa Post, Sabbavaram Mandal, Ellupi, Visakhapatnam -531035. In Reliance Life Insurance Policy No. 50535443, my name was mentioned as Mr. Seeramsetty Eswar Rao instead of **Mr. SEERAMSETTI PEDA ESWARARAO.** Two names belong to me only. One and same person for all purposes.

IN THE HON'BLE COURT OF THE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT : VISAKHAPATNAM
O.S. 941/2025

Between:
State Bank of India, Maharanipeta Branch, Collectrate Compound, Visakhapatnam, Rep. by its Deputy Manager ...Plaintiff
And
Medabayani Sampat Kumar ...Defendants

SUMMONS

To, **The Defendant:**
Medabayani Sampat Kumar, S/o. M. Eswar Rao, Hindu, aged 34 years, R/at D.No.31-30-38, Flat No.TF-1, Sai Sampat Enclave, Visakhapatnam-02.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of loan amount with subsequent interest and costs and other reliefs. You are hereby summoned to appear in the above Court in person or through a Pleader duly instructed, and the matter stands posted to **24-12-2025** at **10:30 A.M** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

(By Order of the Hon'ble Court)
Smt. **L.V. RAMANI,**
Advocate, Visakhapatnam.

IN THE COURT OF THE IIND ADDL JUNIOR CIVIL JUDGE: ANAKAPALLI
O.S. NO : 39 OF 2023

Between :-
State Bank of India, Anakapalli Main Branch, Represented by its Chief Manager Bondapalli Lakshmi Pathi, S/o. Late Soma Raju, Hindu Aged 53 Years Anakapalli, Visakhapatnam District, A.Jr.C.J.
AND
M/s. **ISHA MEDICAL AND GENEAL STORES** Rep. By its Pro:BHUSLAY VENKATA KRISHNA RAO S/o. Kondala Rao Hindu, Aged 50 Years, D.No: 12-5-68, Baruvari Street, Anakapalli, Visakhapatnam District, A.Jr.C.J.

NOTICE

When as you evading the summons sent by the court from time to time through and Registered post will fully. The Honorable court ordered notice to you by way of substitute service and posted the matter to on **23-12-2025 at 10.30 A.M.** for your appearance. You are hereby called upon to appear before the above Honorable Court on **23-12-2025 at 10.30 A.M.** and file your objections if any either in person or through you pleader, failing which Exparte Orders will be passed against you.
(AS PER COURT ORDER ISSUED BY THE IIND ADDL JUNIOR CIVIL JUDGE : ANAKAPALLI)
VAJRAPU KOTESWARA RAO
ADVOCATE,
RAJAHMUNDRY,
CELL NO: 98481 88059

IN THE COURT OF THE IIND ADDL JUNIOR CIVIL JUDGE: ANAKAPALLI
O.S. NO: 198 OF 2023

Between:-
State Bank of India, Sabbavaram Branch, Rep. by its Branch Manager, S.A.Trinadha Rao, S/o.Venkata Krishna Rao Hindu Aged 54 Years, Sabbavaram, Visakhapatnam District, A.Jr.C.J ... Plaintiff
AND
CHETTI SANTHOSH KUMARI, W/o Late CHETTI RAMANA Hindu, Aged 50 Years, D.No:12-33, plot No.92, GANESH NAGAR, SALIGRAMAPURAM POST, VISAKHAPATNAM, VISAKHA DISTRICT A.Jr.C.J. ... Defendant

NOTICE

When as you evading the summons sent by the court from time to time through and Registered post will fully. The Honorable court ordered notice to you by way of substitute service and posted the matter to on **23- 12-2025 at 10.30 A.M.** for your appearance. You are hereby called upon to appear before the above Honorable Court on **23-12-2025 at 10.30 A.M.** and file your objections if any either in person or through you pleader, failing which Exparte Orders will be passed against you.
(AS PER COURT ORDER ISSUED BY THE IIND ADDL JUNIOR CIVIL JUDGE : ANAKAPALLI)
VAJRAPU KOTESWARA RAO
ADVOCATE,
RAJAHMUNDRY,
CELL NO: 98481 88059

IN THE HON`BLE COURT OF THE II ADDL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
IP.23/2025

Between :
Koduru Kasi Naidu ... petitioner
And :
Yallapu Appala Rajasekhar & others ...Respondents

NOTICE FOR PUBLICATION

To Respondents : -
R-1, Yellapu Appala Rajashekar, son of VeerabhadraRao, Hindu, Aged about 43 Years, Residing at D.No.46-22-33/2, Near DRM Office Visakhapatnam - 530016,
R-2, Taduru Kishor Kumar Son of Venkata Satyanarayana Hindu, Aged about 39 Years, Residing at D.No. 8-30-24, Chinna Waltair, Near Tamil Street, Visakhapatnam -530017
R-3, Penki Gowriswara Rao, Son of Apparao, Hindu aged about 29 Years, Residing at D.No. 32-1-42 Near Shivalayam, opposite Ricemart, Railway New Colony, Visakhapatnam.
R-4, Pinninti Upendra son of Venkata Ramana Hindu aged about 29 Years, Residing at D.No.44-2756/1 Shivalayam Street, Railway New Colony, Thatichetlapalem Visakhapatnam.

NOTICE

Please take notice by way of publication that petitioner has filed The above I.P. against You and other Respondents to declare him as in solveny person under section 7 and 10 of provisional, Insolvency Act and The Matter stands Posted To **26-12-2025** for your appearance you on hereby reguared to appear before the Hon`ble Court either in person or through duly instructed advocate on **26-12-2025 at 10:30 Am** in II nd Addl Senior Civil judge court at Visakhapatnam i.e. in the above court, failing which the matter will be heand and determined in your absence
(by the order of the Honble Court)
K.GANAPATHI
Advocate, Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE VI ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
I. A.93/2025 in O.S.1583/2016

Between:
Muddada Kameswari ...Petitioner/D.Hr
And
Nammi Venkatalakshmi & 3 others ...Respondents/J.Drs

NOTICE

To,
R-1: Nammi Venkatalakshmi, W/o. late Narasimhamurthy, Hindu, aged 68 years, Housewife, R/o. D.No.2-10, Baji Junction, Gopalapatnam, Visakhapatnam-27.
R-2: Nammi Srinivasa Murthy, S/o. late Narasimhamurthy, Hindu, aged 46 years, permanent R/o. D.No.2-10, Baji Junction, Gopalapatnam, Visakhapatnam-27.
R-3:Nammi Suryanarayana Murthy, S/o. late Narasimhamurthy, Hindu, aged 43 years, Permanent R/o. D.No. 2-10, Baji Junction, Gopalapatnam, Visakhapatnam-27.
R-4: Muvvala Varalakshmi, D/o. late Narasimhamurthy, Hindu, aged 52 years, Housewife, Permanent R/o. D.No.2-10, Baji Junction, Gopalapatnam, Visakhapatnam-27.

Please take notice that the above petitioner/D.Hr has filed I.A. 93/2025 in O.S. 1583/2016 on the file of VI Addl. Senior Civil Judge, Visakhapatnam: To issue notice to Respondents/J.Drs 1 to 4 mentioned above under Order XXVI Rule 13 to issue a Commission to a person to make the partition or separation of the decree schedule property according to the rights as declared by the Hon'ble Court in the aforesaid preliminary decree for the purpose of passing a Final Decree in terms of preliminary decree, dt. 15th April, 2024 granted by the said Hon'ble VI Addl. Senior Civil Judge, Visakhapatnam, for which the Hon'ble Court ordered notice to you by way of this publication as you have not received notices through Court and registered post. The said matter is posted to **26-12-2025.** On that day you have to appear before the Hon'ble Court at **10:30 A.M** and put forth your defence failing which the Hon'ble Court shall decide as per merits and according to law.

PRELIMINARY DECREE SCHEDULE PROPERTY

A two portions house now modified into & JAI GANESH RESTAURANT & in an extent of 147sq.yards with 1150 sq.ft.plinth area bearing D.No.2-10, Baji Junction, Gopalapatnam within the limits of Gopalapatnam-SRO within the limits of G.V.M.C. is bounded by: **East:**Mahesh Book Centre, **South:**4 lines Aruku Highway Road, **West:** Siddhi Collections Gift Articles Shop, **North:** House belonging to others bearing D.Nos. 2-32 & 2-33.

S.S.N. RAJU & S. ROHINI RAJU
Advocates, Visakhapatnam
Cell: 9440777768, 9963632525.

ప్రజారోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యత

- విమ్స్ ప్రాంగణంలో డ్రగ్ కంట్రోల్ కార్యాలయ నూతన భవనం
- వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌యాదవ్

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అందుకే రాష్ట్రంలో 11 ప్రాంతాల్లో ఔషధ నియంత్రణ కార్యాలయ నూతన భవనాలను రూ.11 కోట్ల వ్యయంతో నిర్మించామన్నారు. మంగళవారం విమ్స్ ప్రాంగణంలో ఔషధ సంయుక్త సంచాలకుల కార్యాలయ నూతన భవనాన్ని వర్చువల్ గా ప్రారంభించారు. కాగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్వయంగా పాల్గొని కార్యాలయ భవన ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు నరసరావుపేట ఒంగోలు నెల్లూరు తిరపతి కర్నూలు అనంతపురం మదనపల్లి పల్నాడు కావలి ప్రాంతాల్లో ఒకేసారి ఈ భవనాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గతంలో అద్దె భవనంలో కార్యాలయాల నిర్వహణ వల్ల నెలసరి రూ.15 లక్షల అద్దె చెల్లించాల్సి వచ్చేదన్నారు సిబ్బంది, వసతి కొరతతో ప్రతినెలా 16,500 ఔషధ నమూనాలను పరీక్షించాల్సి ఉండగా, నాలుగు వేలు కూడా జరగడం లేదన్నారు. ప్రస్తుతం అన్ని సౌకర్యాలతో విశాల భవనాలు సమకూరడంతో సేవలు విస్తృతం చేసే అవకాశం ఉంటుందన్నారు. త్వరలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టి, సేవలను మెరుగుపరుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 20వేల జనరిక్ మందుల దుకాణాలతో పేదలకు నెలసరి రూ.40కోట్ల ఆదా కలుగుతోందన్నారు. ఔషధ నియంత్రణ మండలి విశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రజిత, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ విజయకుమార్ కార్యాలయం లోపల దీప ప్రజ్వలన చేసి ప్రారంభించారు.మంగళగిరిలో మంత్రితోపాటు డైరెక్టర్ ఎం పాండురంగారావు పాల్గొన్నారు.కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, వార్డు కార్పొరేటర్లు మద్ది రామలక్ష్మి రాజశేఖర్, కెల్లా సునీత సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, 11 వార్డ్ టిడిపి ఇన్చార్జ్ రాగతి అచ్యుతరావు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, పోత్రకండ ధర్మారావు, ముగడ రాజారావు, కాకి గంగరాజు పాల్గొన్నారు.

డిడిఒ ఆకస్మిక తనిఖీలు

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డిడిఒ

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని గండిగుండం, కణమాం, ముచ్చర్ల పంచాయతీలను డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ నిర్మలాదేవి మంగళవారం ఆకస్మిక పర్యటన చేపట్టారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కణమాం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని వివిధ ప్రభుత్వ సర్వేలు, పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు.

ఇంటిపన్ను వసూలు, స్వామిత్వ సర్వేపై పంచాయతీ అభివృద్ధి అధికారి కుమార్‌ను ప్రశ్నించారు. కణమాం ఇంటింటా పన్ను వసూళ్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కుక్కల బెడదపై స్థానిక విజ్ఞప్తిపై డిడిఒ నిర్మలాదేవి స్పందిస్తూ, తక్షణమే తగు చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గోరింటలోనిసంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ మెరుగుపర్చాలని సూచించారు.

బాల్య వివాహాల నిర్మూలన బాధ్యత

ప్రజాశక్తి- సీతమ్మధార : బాల్య వివాహాలను నిర్మూలించడంలో అంగన్వాడీలు భాగస్వాములు కావాలని మహిళాశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి రామలక్ష్మి అన్నారు. మంగళవారం 53వ వార్డు ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద నున్న ఐసిడిఎస్ అర్బన్ కార్యాలయంలో అంగన్వాడీలకు నిర్వహించిన ప్రాజెక్టు సమావేశంలో మాట్లాడుతూ, బాల్య వివాహాలను నిర్మూలించడానికి మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ, జాతీయస్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, అందులో భాగంగా 18 ఏళ్లలోపు బాలికలకు పెళ్లిళ్ల జరగకుండా నిరోధించడం ముఖ్యమన్నారు. లక్ష్యానికి అనుగుణంగా బాలల హక్కులను కాపాడడంపై .అవగాహన, చట్టాన్ని అమలు చేయడం, ప్రభుత్వ, సామాజిక సంస్థల సహకారంతో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడంపై దృష్టి పెట్టాలన్నారు.

అంగన్వాడీలు ఎప్పటికప్పుడు గ్రోత్ మానిటరింగ్ శాతశాతం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని అర్బన్ సిడిపిఒ కె నీలిమ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి కె. హరికృష్ణ, ప్రొటెక్షన్ అధికారి దాసరి చంద్రశేఖర్, మమత సెక్టార్ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గీత సహ కులాల ఐక్యత అవసరం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గీత సహ కులాల నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలంటే గీత సహ కులాల మధ్య ఐక్యత అవసరమని ఆయా కులాల సమాఖ్య అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జివిఎంసి మూడో వార్డు నేరెళ్లవలస కాలనీలో గీత సహ కులాల సమావేశంలో మాట్లాడుతూ, సమస్యలను ప్రాధాన్యత వారీగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అంగటి రాము, ఎపి శెట్టి బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ మధుసూదనరావు, యాత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బి రాములప్పడు, సంఘం నాయకులు రీసు రమణ, మాజీ ఎంపిటిసి కాకర ఎల్లారావు పాల్గొన్నారు

కూటమి ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం మాజీ మంత్రి ఆవంటి ఎమ్మెల్యే పి సత్య నారాయణ జన్మదిన వేడుకలు నిర్వహించారుకేక్ కట్ చేశారు కార్యక్రమంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల కల్లు గీత సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు. వచ్చేనెల 4న వనసమారాధన జయప్రదం చేయాలని కోరారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు

వైసిపి సంతకాల సేకరణ ప్రతులు అందజేత

ఆనందపురంలో సంతకాల ప్రతుల కట్టలను ప్రదర్శిస్తున్న మజ్జి శ్రీను

ప్రజాశక్తి-పెందుర్తి: ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపిచేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలను మంగళవారం రాంపురంలోని పార్టీ కార్యాలయంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్‌కు అందజేశారు. ఈసందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ, వైసిపి ఆధ్వర్యంలో సేకరించిన సంతకాల ప్రతులను రాష్ట్ర కార్యాలయానికి చేరవేసి, గవర్నర్‌కు అందజేస్తామన్నారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణ ఆగే వరకు వైసిపిపోరాడుతుందని స్పష్టం చేశారు. పార్వతీపురం జిల్లా పరిశీలకులు శరణం చిన అప్పలనాయుడు, .రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాస్, పరవాడ జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు, బైలపూడి భగవాన్ జయరాం, మండల పార్టీ అధ్యక్షులు గోరపల్లి శ్రీను, కోన రామారావు, వార్డు అధ్యక్షులు తమర్ల నర్సింగ్, రాపర్తి మాధవరావుఉన్నారు

ఆనందపురం: వైద్యకళాశాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి సేకరించిన కోటి సంతకాల సేకరణ ప్రతులను రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తామని ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు అన్నారు .ఈనెల 15న విశాఖ సెంట్రల్ పార్క్ వద్ద నిర్వహించే జిల్లా స్థాయిలో ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిరి సహస్ర, మజ్జి వెంకట్రావు, గనరెడ్డి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, షినగం దామోదరరావు, కోరాడ ముసలి నాయుడు, ఇల్లాపు వెంకట జగన్, రౌతు శ్రీను పాల్గొన్నారు.

యస్.రాయవరం : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 55వేల సంతకాలు సేకరించినట్లు వైసిపి నియోజకవర్గం ఇంచార్జ్ కంబాల జోగులు అన్నారు. మండలంలోని అడ్డరోడ్డులో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన రాష్ట్రంలో విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం రంగాలు అభివృద్ధి చెందాలంటే వైసిపి ప్రభుత్వం రావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మధు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : తూర్పు నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ విజయవంతంగా పూర్తయిందని నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త మొల్లి అప్పారావు తెలిపారు. 60 రోజులు నాయకులు, కార్యకర్తలు కాలనీల్లో తిరిగి 83,269 సంతకాలను సేకరించినట్లు పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

బస్ షెల్టర్‌పైకి దూసుకెళ్లిన జివిఎంసి లారీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కంచరపాలెం సర్వీస్ రోడ్డులో షిరిడి సాయి ఆలయం వద్ద బస్‌స్టాప్‌ను జివిఎంసి లారీ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. మంగళవారం తెల్లవారుజామున జరిగిన సంఘటనలో బస్టాప్‌లో నిద్రిస్తున్న షేక్ ఐకారి (34) అక్కడికక్కడే మృతిచెందాడు. అతని స్నేహితుడు రాకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని షేక్ ఐకారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. మృతుడు షేక్ ఐకారి తిక్కవానిపాలెం వాడపేటలో నివసిస్తున్నాడు. రోడ్డు పక్కన కాగితాలు, సీసాలను ఏరుకొని అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కంచరపాలెం సిఐ దాశరథి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ మోహిద్దీన్ కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో నుజ్జయిన కారు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలస వద్ద కారును వెనక నుండి ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో కారు నుజ్జు నుజ్జు కాగా, ఎటువంటి ప్రాణనష్టం కలగపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన జి గోవింద్‌తో పాటు మరో వ్యక్తి చీపురుపల్లి నుండి మధురవాడ వెళ్తుండగా, హైవే నుండి వేములవలస పెట్రోల్ బంక్ వైపు సర్వీస్ రోడ్డులో వస్తుండగా, అదే సమయంలో విజయనగరం నుండి పాత గాజువాక వెళ్తున్న గాజువాక డిపో ఆర్టీసీ బస్సు వెనక నుండి అతి వేగంగా వచ్చి కారును ఢీకొందని పోలీసులు వివరించారు. ఈ సంఘటనలో స్విఫ్ట్ డిజైర్ కారు నుజ్జు నుజ్జయింది. కారులో ఉన్న వారికి బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి నష్టం జరగలేదు. కారు నడుపుతున్న జి గోవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి సంతోష్ కేసు నమోదు చేశారు. హెచ్‌సి కృష్ణ దర్యాప్ చేస్తున్నారు ప్రమాద స్థలంలో హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ సూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, జాతీయ రహదారి అధికారులు పరిశీలించి, మలుపు వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనంతో గుబులు

అనుమానాస్పదంగా నిలిచి ఉన్న వాహనం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలస పూల మార్కెట్ సమీపంలో బోని రహదారి వైపు వెళ్లే మార్గంలో దొడ్డ డెయిరీ స్టాక్ పాయింట్ ఎదురుగా ఒక ఎలక్ట్రికల్ గూడ్స్ వాహనం అనుమానాస్పదంగా నిలిచి ఉంది. 20 రోజులుగా అక్కడే ఉండటంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోవడం, రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా వదిలేయగా, రోజులు గడుస్తున్నా దాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో భయాందోళనలు నెలకొన్నాయి. వాహన తాళాలు పగలగొట్టబడి, అందులోని కొంత సామాను చోరీకి గురైనట్లు స్థానికులు తెలిపారు.

ఈ వాహనం ఎవరికి చెందినదో, దొంగతనం చేసి ఇక్కడ వదిలేశారా, లేక మరే కారణంతో నిలిపివేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని, రద్దీగా ఉండే ఆనందపురం పూల మార్కెట్ పరిసరాల్లో నిఘా పెంచి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు

మహిళా సంఘాలకు శిక్షణ

శిక్షణలో మాట్లాడుతున్న డిపిఎం వైదేహి

ప్రజాశక్తి- ఆనందపురం :మహిళల అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక అవసరమని డిఆర్‌డిఎ డిపిఎం వైదేహి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా విజన్ బిల్డింగ్‌పై నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా డిపిఎం మాట్లాడతూ, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక తప్పనిసరి అన్నారు. రానున్న ఐదేళ్లలో గ్రామ, మండల సమాఖ్యలు వ్యాపారాభివృద్ధిలో అగ్రగాములుగా నిలవాలంటే వ్యక్తిగత, కుటుంబ, గ్రామ కలలను సమన్వయం చేసే విధంగా స్పష్టమైన విజన్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు. ఆర్థిక స్వావలంబన దిశగా మహిళా సంఘాలు చురుకుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎపిఎం ఎస్తేరు రాణి పర్యవేక్షణలో నిర్వహించిన శిక్షణలో ఎల్‌సిసి కృష్ణమూర్తినాయుడు, సిసిలు అప్పలనాయుడు, జానకి రమణమ్మ, మణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు తేజేశ్వరి

తేజేశ్వరిని అభినందిస్తున్న డిఇఒ, తదితరులు

ప్రజాశక్తి-తగరపువలస : రాష్ట్రస్థాయి కౌశల్‌కు స్థానిక జివిఎంసి.అంబేద్కర్ ఉన్నత పాఠశాల చిట్టివలస విద్యార్థిని కొప్పల తేజశ్వరి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన కౌసల్ పరీక్షకు జిల్లాలో మొదటి స్థానం సాధించింది.కొప్పల తేజేశ్వరిని జిల్లావిద్యాశాఖాధికారి.ఎన్.ప్రేమకుమార్ అభినందిస్తూ నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్‌వివిపిడి.స్వామి,ఉపాధ్యాయ సిబ్బంది ఎన్.జగదీష్ పి.సత్యలక్ష్మి, రెడ్డిపల్లి అప్పలరాజు, కె. బలరామకృష్ణ, ఎం.విశ్వేశ్వరరావు .ఎన్. శ్రీదేవి, ప్రమీల, మహాలక్ష్మి తదితరులు తేజశ్వరిని అభినందిస్తూ నోటు పుస్తకాలు,పెన్నులు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఈనెల 27న తిరుపతిలో జరగబోయే రాష్ట్రస్థాయి కౌశల్ పరీక్షలో మొదటి స్థానంలో నిలవాలని అభినందించారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి -పద్మనాభం.: మండలంలోని విలాస్‌ఖాన్ పాలెం గ్రామంలో మంగళవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి పి నారాయణమూర్తి సందర్శించారు. చెత్త నుంచి సంపద తయారీ షెడ్‌ల నిర్వహణను పరిశీలించారు కార్యక్రమంలో సర్పంచ్ సత్యవతి, ఎంపిడిఒ వి. నగేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

14న సొండి కుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ సొండి కుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఈ నెల 14న ఉదయం10 గంటలకు సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా గల శ్రీనివాస కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు తెలిపారు. విశాఖపట్నంలో నివసిస్తున్న సొండి కులస్తులందరూ పాల్గొనాలని కోరారు.

సమస్యలపై యుటిఎఫ్ నిరసన

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటి ఫ్ భీమిలి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని, పార్లమెంట్‌లో ఆర్‌టిఇ యాక్ట్ సెక్షన్ 23 (1)కు సవరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు రెండో శనివారం, ఆదివారాల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక తరగతులు నిర్వహించ వద్దని కోరారు అనంతరం యుటిఎఫ్ ప్రతినిధులు ఆర్‌డిఒ సంగీత్ మాధుర్‌కు వినతిపత్రం అందజేశారు . కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్ ఎ శ్రీనివాసరావు, మహేష్, ఎం రామకృష్ణ, ఎస్ రమణ పాల్గొన్నారు

వైసిపిలో సీనియర్లకు ప్రాధాన్యత

దేవన్‌రెడ్డిని సన్మానిస్తున్న దానప్పలు, వైసిపి నాయకులు

ప్రజాశక్తి -గాజువాక: వైసిపిలో సీనియర్లకు తగినంత ప్రాధాన్యత ఉంటుందని ఆ పార్టీ గాజువాక నియోజవర్గ ఇన్‌ఛార్జి తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి అన్నారు. వైసిపి వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శిగా నియమితులైన జివిఎంసి 87వ వార్డు సీనియర్ నాయకులు దుగ్గపు దానప్పలు మంగళవారం తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారుఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ వార్డులో పార్టీని బలోపేతం చేయడం ద్వాం రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో అన్నిస్థానాల్లో జయకేతనం ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కణితి గ్రామ దేవత కమిటీ చైర్మన్, 86 వ వార్డు పరిశీలకులు, వార్డు అధ్యక్షులు బొడ్డ గోవింద, ప్రగడ శ్రీనివాస్, 76వ వార్డు పరిశీలకులు ముద్దపు దామోదర్, బోండా గోవిందరాజులు, బొడ్డ సన్యాసిరావు, గాలి ఆనంద్, ప్రగడ శంకర్రావు, పూడి శ్రీనివాసరావు, గున్న రామారావు, దాకా సత్తిబాబు,ముద్దపు మురళీమోహన్ పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్‌లో మహిళలకు రిజర్వేషన్లపై హర్షం

ప్రజాశక్తి- సీతమ్మధార: బార్ కౌన్సిల్‌లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ 30 శాతం రిజర్వేషన్ ఇవ్వాలంటూ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పునివ్వడంపై విమెన్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వావా) సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పౌర గ్రంథాలయంలో మీడియా సమావేశంలో వావా అధ్యక్షులు పప్పు అనురాధ, జనరల్ సెక్రెటరీ హేమమాలిని మాట్లాడుతూ అన్ని శాఖల్లోని మహిళా రిజర్వేషన్ ఉన్న బార్ కౌన్సిల్లో మహిళా రిజర్వేషన్ లేకపోవడం పట్ల తమకు బాధగా ఉండేదన్నారు.

దీనిపై దాఖలైన రిట్ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం 2026 జనవరి ఫిబ్రవరిలలో జరగనున్న బార్ కౌన్సిల్ ఎలక్షన్లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్ ప్రకటిస్తున్నామని తెలిపారన్నారు. ఈ తీర్పు మహిళా న్యాయవాదులకు ఎంతో ఊరట కలిగించి, రాష్ట్ర బార్ కౌన్సిల్ లో తమ వంతు సేవ చేసే అవకాశం కల్పించిందని ఆనందం వ్యక్తం చేశారు. దీనికి సహకరించిన కౌన్సిల్ చైర్మన్ సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా, ఇతర సీనియర్ మహిళా న్యాయవాదులకు, రిట్స్ వేసి చారిత్రాత్మక తీర్పునకు నాంది పలికిన పిటిషనర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చలో ఢిల్లీ ఆందోళనలో పెన్షనర్లు

ఢిల్లీలో చిట్టివలస జ్యూట్‌మిల్లు పెన్షనర్లు

ప్రజాశక్తి -తగరపువలస: ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు అమలు, ఇతర సమస్యలు పరిష్కారానికి జాతీయ పెన్షనర్ల సంఘం పిలుపుమేరకు చలో ఢిల్లీ ఆందోళన మంగళవారం చిట్టివలస జ్యూట్ మిల్లు పెన్షన్‌దారుల సంఘం ప్రధానకార్యదర్శి దామోదర బాబాజీ ఆధ్వర్యంలో పలువురు పెన్షనర్లు తరలివెళ్లారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. మినిమం పెన్షన్, అందరికీ మెడికల్ సదుపాయాలు పెన్షన్ దారులకు రైల్వేలో రాయితీ, ఇతర బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుధాకర్, ఎస్.కె హుస్సేన్ .ఎస్ అప్పలనాయుడు మోర్ అప్పలరాజు. రాంబాబు సత్యం. సూరిబాబు అప్పల్ రెడ్డి పెంటయ్య పాల్గొన్నారు

ఘనంగా 'కోయిల్ తిరుమంజనం' సేవ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం, వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో కోయిల్ తిరుమంజనం సేవను మంగళవారం భక్తిశ్రద్ధలతో, వైదిక సంప్రదాయబద్ధంగా విజయవంతంగా నిర్వహించారు. ఆలయ ఎఇఒ కెజతిరుమలేశ్వరావు పర్యవేక్షణ అధికారి బి. సత్యశ్రీనివాస్ ఆలయ అర్చకులు, వైదిక సిబ్బంది, ఆలయ సిబ్బంది 'కోయిల్ తిరుమంజనం' సేవ శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు కోయిల్ తిరుమంజనం సేవ సందర్భంగా దర్శనాలను నిలుపుదల చేశారు.

మానవ హక్కుల పరిరక్షణకు బాధ్యత

ప్రజాశక్తి ములగాడ : మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతయని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్-ఎస్ విభాగం ఆధ్వర్యంలో మానవ హక్కుల సదస్సులోమాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణలో వ్యక్తిత్వవికాసం, సమాజాభివృద్ధి సాధ్యమై ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయ దేవి మాట్లాడుతూ, సమాజంలోని అస్థిరత, అసమానత్వం, అసమర్థత, వివక్షత, బెదిరింపులు, పేదరికం మొదలైన అంశాలు మానవ హక్కులకు అడ్డంకులుగా ఉన్నాయని, వీటిని పరిష్కారానికి అంతా కృషి చేయాలన్నారు. నిర్వాహకులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అభినందించారు.

యుటిఎఫ్ టెన్త్ మోడల్ పేపర్లు ఆవిష్కరణ

ఆరిలోవలో యుటిఎఫ్ టెన్త్ మోడల్ పేపర్లు ఆవిష్కరిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - ఆరిలోవ : అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఎస్ఎస్‌సి విద్యార్థులకు యుటిఎఫ్ ప్రయోజనకరంగా రూపొందించిన స్టడీమెటీరియల్, మోడల్ పేపర్స్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిఇఒ ఎన్ ప్రేమకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కోసం యూటిఎఫ్ చేస్తున్నకార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, డిసిఇబి సెక్రెటరీ కృష్ణకుమార్, యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వర్ , జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్, కోశాధికారి కె.రాంబాబు ,జిల్లా కార్యదర్శి ఎం రామకృష్ణ, రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

గాజువాక : యుటిఎఫ్ గాజువాక మండల శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ మంగళవారం అందజేశారు. అక్కిరెడ్డిపాలెం, మింది, కణితి, గాజువాక, యారాడ, అగనంపూడి పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో సులువుగా అత్యధిక మార్కులు సాధించాలనే ఉద్దేశంతో అనుభవం గల నిపుణులతో తయారు చేయబడిన యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ ఆయా పాఠశాలలకు ఉచితంగా అందజేశారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పివిఎస్ఎస్ఎస్. ఆంజనేయ మాట్లాడుతూ ఏటా యుటిఎఫ్ ఉచితంగా అందిస్తున్న ఈ స్టడీ మెటీరియల్ పదవ తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడు తుందన్నారు. మంచి మార్కులు సాధించే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇమంది ప్రసాద్ గౌరవాధ్యక్షుడు కె.మురళీకృష్ణ, నూకరాజు, శ్రీనివాస్ రాజు,కార్యవర్గ సభ్యులు డి నూకరాజు, శివ విద్యార్థులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ టెన్త్ మోడల్ పేపర్లు ఆవిష్కరణ

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నేత గనిశెట్టి, మహిళా కార్మికులు

ప్రజాశక్తి-పరవాడ : విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పరవాడ మండలం కేంద్రంలో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలంభిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల్లో పలు తీర్మానాలు చేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన జరుగుతుందని చెప్పారు. ఈ మహాసభలు జయప్రదానికి అందరూ తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకురాలు ఎస్ వెంకటలక్ష్మి, జీ వరలక్ష్మి, ఉమా, రమాదేవి, రమణమ్మ, మధురమ్మ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న సిఐటియు, ఐద్వా నాయకులు

కరపత్ర ప్రచారం

కశింకోట : సీఐటీయూ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని మంగళవారం కశింకోటలో కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా నాయకులు, డిడి వరలక్ష్మి, అమ్మాజీ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల విరాళం

కె.కోటపాడు : సిఐటియు ఆలిండియా మహాసభలు జయప్రదానికి మండలంలోని ఆనందపురంకు చెందిన శ్రీగణేష్ ఆటో యూనియన్ నాయకులు రూ.3000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు ఈర్లె నాయుడు బాబు, రొంగలి ముత్యాల నాయుడు మాట్లాడుతూ జనవరి 4న జరుగు బహిరంగ సభకు యూనియన్ నుంచి 30 మంది హాజరవుతామని చెప్పడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ గంపు రామారావు, కార్యదర్శి సింహాచలం, నాయకులు నీలు కోటేశ్వరరావు, ఆటో యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న ఆటో కార్మికులు

విరాళాలు సేకరణ

మధురవాడ : సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ నాయకుడు డి. అప్పలరాజు కోరారు. మంగళవారం జివిఎంసి ఆరోవార్డు కారుషెడ్ కూడలి వద్ద విరాళాలను సేకరించారు. ఈసందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఈనెల 31 నుంచి వచ్చేనెల 4 వరకు నిర్వహించే మహాసభలో భాగంగా 4న ర్యాలీ, బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరారు.సిఐటియు 18వ అఖిల భారత మహాసభ విశాఖలో తొలిసారి జరగడం రాష్ట్రానికే గర్వ కారణమని, జయప్రదానికి సహకరించాలని కోరారు.కార్యక్రమంలో కొండమ్మ పాల్గొన్నారు.

విరాళాలు వసూలు చేస్తున్న సిఐటియు నాయకులు

రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సంతోష్

ఏటికొప్పాక హస్త కళాకారునికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన హస్త కళాకారుడు గొరస సంతోష్ కుమార్‌కు జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో జరిగిన జాతీయ హస్త కళాకారుల అవార్డ్ కార్యక్రమంలో జాతీయ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. సంతోష్ రూపొందించిన బొమ్మలకొలువు అనే కళాఖండంకు జాతీయ స్థాయి పురస్కారం లభించిందని తెలిపారు. ఈ జాతీయ అవార్డు ఏటి కొప్పాక లక్క బొమ్మలను మరోకసారి ఢిల్లీ స్థాయిలో నిలబెట్టింది. సంతోష్ అవార్డు అందుకోవటం పట్ల కుటుంబ సభ్యులతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

భూసార పరీక్షతో రైతుకు, భూమికి మేలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులు భూసార పరీక్ష చేసుకోవడం ద్వారా భూమికి కావలసిన పోషకాలు అందించడం ద్వారా రైతు అధిక ఆదాయం పొందవచ్చని సహాయ వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కూండ్రం గ్రామంలో మంగళవారం భూసార పరీక్షపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భూసార పరీక్ష చేయించుకోవడం వలన భూమిలో ఉన్న పోషకాలు విలువలు తెలుస్తాయని, వీటి ఆధారంగా ఎరువులు సమపాళ్లలో వేసుకోవచ్చని తెలిపారు. ప్రతి రైతు భూసార పరీక్ష భూసార పరీక్ష, రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా తప్పని సరిగా చేయించి, వాటి ఫలితాలకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపడితే మేలైన దిగుబడులు పొంద వచ్చని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి రంగాచారి మాట్లాడుతూ మినుములు పెసలు వేరుశనగ విత్తనాల కోసం తమ సమీప రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, తెలుగు యువత నాయకుడు సత్యనారాయణ, రైతు సేవ కేంద్రం సిబ్బంది ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్ ఫిర్యాదుపై స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఈనెల 8న నిర్వహించిన ప్రజా దర్బార్లో భీమునిగుమ్మం ఏరియా నుంచి కొమ్మ సునీత తమ ఇంటిపై జీవీఎంసీ చెట్టు కొమ్మలు విరిగిపడి ఇల్లు పాడవుతుందని శాసనసభ్యులకు విన్నవించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జోనల్ కమీషనర్ చక్రవర్తి, హార్టికల్చరర్ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి వైజాగ్ నుంచి సిబ్బంది తెప్పించి పవర్ రంపాలతో చెట్ల కొమ్మలు తొలగించారు. సమస్య పరిష్కారం చూపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేసారు.

ప్రభుత్వ నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఉత్సవాలు, పండుగల్లో స్టేజ్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసే నిర్వాహకులు కొన్ని నియమాలు పాటించాలని డిఎస్‌పి శ్రావణి సూచించారు. నిర్వాహకులు తమ కార్యక్రమాలను రాత్రి 10.30 గంటలకు ముగించాలన్నారు. ప్రతి స్టేజ్ దగ్గర సీసీటీవీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్టేజ్‌కి ముందు వీక్షకులు ఎవరూ కూడా స్టేజి మీదకి రాకుండా డి రింగ్ ఏర్పాటు చేసుకోవాలని వెల్లడించారు. డయాస్ ఫిట్నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఆర్ అండ్ బి, ఎలక్ట్రికల్, ఫైర్ సర్వీసెస్ డిపార్ట్మెంట్స్ దగ్గర నుండి కూడా అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ నియమాలు పాటిస్తేనే స్టేజ్ ప్రోగ్రామ్‌లకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు.

ఘనంగా రఘునాథ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వర్తక సంఘం ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్, సోదర సంక్షేమ సమితి గౌరవ అధ్యక్షులు కొణతాల రఘునాథ్ జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పివి జగన్మోహ్నరావు, కార్యదర్శి సీతారామదాసు బాబ్జి, కోశాధికారి బీసెట్టి చంద్రశేఖర్, సంస్థ వ్యవస్థాపకులు కొణతాల పూర్ణచంద్రరావు, సంస్థ పుట్టినరోజు కమిటీ చైర్మన్ కెయం నాయుడు, పెద్దలు బుద్ద అప్పారావు, పొలమరశెట్టి నరసింగరావు, రఘునాథ్ అభిమానులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో లేగ దూడలను పెంచాలి

ప్రజాశక్తి-సబ్బవరం : పాడి రైతులు శాస్త్రీయ పద్ధతిలో లేగ దూడలను పెంచాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. రామమోహన్‌రావు అన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో లేగ దూడల ప్రదర్శన ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. 44 లేగ దూడలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు. ప్రదర్శనలో పాల్గొన్న ప్రతీ లేగదూడకు మినరల్ మిక్చర్, నట్టల నివారణ మందులు ఉచితంగా అందజేశారు. టిడిపి మండల మాజీ అధ్యక్షులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, మాజీ జడ్పీటీసీ రొంగలి దేముడు బాబు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, కూటమి నాయకులు, డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాస్, ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు ఉషా కుమారి, పశు వైద్యాధికారులు డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

అనకాపల్లిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు మాట్లాడుతూ సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు రైతు బజార్ మంజూరు చేసేందుకు కృషి చేయాలన్నారు. 11వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరంలో అనకాపల్లి జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అడ్డబోయిన నారాయణరావు, గొర్లి వెంకటేశ్వరావు, ఎస్ ప్రకాష్, ఎల్లపు రామేషు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచకర్ల రంగనాథ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పరవాడ : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కుమారుడు పంచకర్ల రంగనాథ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల నాయకులు కేక్ కటింగ్ చేశారు. పరవాడ బీసీ కాలనీ మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పి హెచ్‌సి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల ఇన్‌చార్జ్ పంచకర్ల ప్రసాద్‌రావు, మండల అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు చింతకాయల సుజాత ముత్యాలు, సిరపరపు అప్పలనాయుడు, మోటూరు సన్యాసినాయుడు, కూటమి నాయకులు బుగిడి రామ గోవిందరావు, వియ్యపు చిన్న, అర్జిల్లి దేవి రవి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : పంచకర్ల రంగనాథ్ జన్మదిన వేడుకలు మండల జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కర్రి కనకరాజు, నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సింగంపల్లి శ్రీనివాసరావు, బంతికోళ్ళ పద్మ, కర్రి నర్సింగరావు, బోకం స్వామి నాయుడు, గొర్లి కుమార్ స్వామి, తాటిపాముల శేఖర్, పల్లా రమణ, సబ్బవరపు రమణ, మేడపాటి రాము, దాసరి రాము, జి.గోవింద, మద్దు రమేష్ సాయిరాం, వనం కిషోర్, వాకాడ తేజ, చైతన్య, సాయి నాయుడు పాల్గొన్నారు.

సబ్బవరంలో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

అభివృద్ధికి నోచని గౌరీశ్వరస్వామి ఆలయ కోనేరు

- డ్రైనేజీ సంపును తలపిస్తున్న వైనం
- ఆదాయం ఉన్నా చిత్తశుద్ధి కరువు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలోని ఎంతో ప్రతిష్ట కలిగిన 800 ఏళ్ల క్రితం నాటి గౌరీశ్వర స్వామి ఆలయ కోనేరు ఎటువంటి అభివృద్ధికి నోచుకోక డ్రైనేజీ సంపుగా మారింది. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ ఆలయం నిత్యం భక్తులతో అలరారుతూ ఉంటుంది. కార్తీక మాసం, శివరాత్రి వేళల్లో భక్త సందోహంతో నిండి ఉంటుంది. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయం ఆదాయానికి కొదవలేదు. దీంతోపాటు దాతల సాయం పుష్కలంగానే ఉంటుంది. అయినా కూడా దేవాదాయశాఖ వారు దీనిని పట్టించుకోకపోవడంతో పట్టణంలో ఉన్న మురుగు నీరు ఇందులోకి రావడంతో దుర్గంధ భరితంగా తయారైంది. వర్షాలు వచ్చినప్పుడు తప్ప ఈ కోనేరుకు మంచినీరు రాకపోవడంతో మురుగునీరు పేరుకుపోయింది. గతంలో దీని అభివృద్ధి కోసం ప్రయత్నాలు జరిగినా ఆచరణకు నోచుకోలేదు. చోడవరంలో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమానికైనా లక్షల్లో విరాళాలు పోగు పడతాయి. ఈ కోనేరు విషయంలో ఎవరు ముందుకు రాకపోవడం ఈ దుస్థితికి కారణంగా ఉందని భక్తులు వాపోతున్నారు. దేవాదాయశాఖ ఈ ఆలయానికి వచ్చిన ఆదాయంతోనైనా బాగు చేయించి వచ్చినని కొంతమంది భక్తులు అభిప్రాయపడుతున్నారు.

మురుగునీటితో నిండి ఉన్న కోనేరు

నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

మునగపాకను నక్కపల్లి డివిజన్‌లో విలీనం చేస్తే ఊరుకోం

ప్రజాశక్తి -మునగపాక : మునగపాక మండలాన్ని నక్కపల్లి రెవెన్యూ డివిజన్లో విలీనం చేస్తే ఊరుకునేది లేదని వైకాపా అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ హెచ్చరించారు. మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవిన్యూ డివిజన్లోనే కొనసాగించాలని కోరుతూ మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఈ శిబిరాన్ని సందర్శించిన ప్రసాద్, ధర్మశ్రీ మాట్లాడుతూ మునగపాక మండలాన్ని నక్కపల్లి రెవెన్యూ డివిజన్లో కలపడాన్ని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూన గళం వినిపించాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైకాపా మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి మోహనరావు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి భూసార సంరక్షణ కార్యక్రమం జరిగింది. 8, 9 తరగతుల బాలికలకు భూసార సంరక్షణ మీద అవగాహన కల్పించారు. మట్టి నమూనా సేకరణ డెమో పద్ధతిలో తెలియజేశారు. ఈ పరీక్ష ద్వారా భూమిని ఎంత శాతం ఎరువులు వాడాలో తెలుసుకొని, కెమికల్ ఎరువులు నుంచి కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు ఎం.విజయలక్ష్మి, మాధురి శరణ్య, ఉపాధ్యాయులు వరలక్ష్మి, అరుణ కుమారి, వ్యవసాయ సహాయకులు అరుణ పాల్గొన్నారు.

పార్క్ సెంటర్లో హైమాస్ట్ లైటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 81వ వార్డు పరిధిలోని పార్క్ సెంటర్‌లో హైమాస్ట్ లైటింగ్ సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పివి జగన్మోహన్రావు, జగన్నాథ స్వామి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాడి బుజ్జి, భోగలింగేశ్వర స్వామిదేవస్థానం డైరెక్టర్ మద్దాల నారాయణరావు, కొణతాల శ్రీనివాసరావు, రాజు, జనసేన నాయకులు ఉమా, ఎలక్ట్రికల్ ఏఈ సుధాకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : ఈ నెల 13న జాతీయ లోక్ ఆధాలాత్ అన్ని కోర్టులలో నిర్వహించనున్నట్లు యలమంచిలి సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) పి.విజయ ప్రగటన మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రకాల సివిల్ కేసులు, మోటార్ వెహికల్ కేసులు, డివిసి కేసులు మనోవర్తి, బ్యాంక రుణాల కేసులు, కుటుంబ వివాదాల కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులు లోక్ ఆధాలాత్ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చుని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-సబ్బవరం : ఓ చిన్నారి ప్రాణ రక్షణ కోసం పలు సేవా సంఘాలు ఫోన్ పే ద్వారా విరాళాల సేకరించి ఆ చిన్నారి తల్లిదండ్రులకు రూ.1,85,289 అందజేశారు. చీడికాడ మండలం కండివరం గ్రామానికి చెందిన గేదెల గంగునాయుడు, హేమ దంపతుల 18 నెల చిన్నారి గేదెల కారుణ్య లివర్ సమస్యతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మండలంలోని శ్రీబంగారు తల్లి సేవా సంఘం సభ్యులు సింగంపల్లి వెంకట్రావు, రొమాల ప్రవీణ్ కుమార్, గండి రవికుమార్, పరవాడ అనిత తదితరులు సబ్బవరం మండలం నుండి లక్ష 13వేలు, ఆర్క ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ టి.సత్యనారాయణ, వై నాగేష్ రూ.39,000, మల్కాపురం కానిస్టేబుల్ జయేంద్ర, మేడిశెట్టి రాము రూ.33,189 సేకరించి మొత్తం రూ.1,85,289 చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు.

రూ.11.016 కోట్లతో ఆరోగ్య కేంద్రాల నిర్మాణం

ప్రజాశక్తి-పాయకరావుపేట : పాయకరావుపేట నియోజకవర్గంలో రూ.11.016 కోట్లతో 56 కొత్త ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో 54 విలేజ్ హెల్త్ క్లినిక్స్, 2 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు ఇతర వైద్య సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలు ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : దేశ రక్షణలో అసువులు బాసిన, విధి నిర్వహణలో గాయపడిన మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ఉద్దేశించిన సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ప్రతి ఒక్కరూ ఉదారంగా విరాళాలు అందించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సైనిక సంక్షేమ వింగ్ కమాండర్ చంద్రశేఖర్‌తో కలిసి సాయుధ దళాల జెండాను, గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముందుగా కలెక్టర్ పతాక దినోత్సవ నిధికి విరాళం అందించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరులు, వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలు ఈ మహత్తర కార్యానికి పెద్ద మనసుతో సహకరించాలని కోరారు. రక్షణకు పాటుపడిన వీరుల పట్ల కృతజ్ఞతగా, వారి కుటుంబాల కోసం విరాళాలు ఇవ్వడం మన సామాజిక బాధ్యత అని కలెక్టర్ ఉద్ఘాటించారు. యూపీఐ/ క్యు ఆర్ కోడ్ ద్వారా కూడ విరాళాలు చెల్లించవచ్చున్నారు. మనం ఇచ్చే ప్రతి రూపాయి నేరుగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. అనకాపల్లిలో సైనిక్ సంక్షేమ భవన నిర్మాణానికి 70 సెంట్లు భూమి, అనకాపల్లి జిల్లాకి సంబంధించిన 9 మంది యుద్ధ వీరులకు 300 గజాల స్థలం ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, సూపరింటెండెంట్ జి కృష్ణారావు, అనకాపల్లి సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అగ్గాల హనుమంతరావు, మాజీ సైనికుడు కనకరాజు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పరవాడ : ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) పరవాడ మండల నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. యుటిఎఫ్ మండల అధ్యక్షురాలిగా కే.సుభాషిణి దేవి, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా బొడ్డు సత్యనారాయణ, కోశాధికారిగా కర్రి బాలరాజారావు, ఉపాధ్యక్షులుగా జి.బంగారరాజు, వి.ఫ్లోరెన్స్, కార్యదర్శులుగా పి.నరసింహమూర్తి, ఎమ్.ప్రకాశ్‌రావు, వి.అప్పారావు, పీఎంఎన్.విజయ, జిల్లా కౌన్సిలర్లుగా వి.శ్రీలక్ష్మి, ఎం.రామునాయుడు, యు.మనోరంజని, జె.శాంతాదేవి, యుటిఎఫ్ సీపీఎస్ కన్వీనర్‌గా ఎస్.వరహాలబాబు, మహిళా కన్వీనర్‌గా ఆర్.ఉమాదేవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్ యాప్‌ల వల్ల ఉపాధ్యాయులపై పడుతున్న పని భారం తీవ్రంగా పెరిగిందన్నారు. పరవాడ మండలంలో 32 మంది సింగిల్ టీచర్లు ఉండగా, సెలవులు, ఆప్షనల్ హాలిడేస్ విషయంలో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు, ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుభాషిణిదేవి, శ్రీనివాస్

ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

మాట్లాడుతున్న సర్పంచ్ అప్పారావు

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ జాతీయ సేవా పథకంలో ఆధ్వర్యాన గాంధీ గ్రామంలో నిర్వహించిన సేవా శిబిరం మంగళవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం నిర్వాహకులు వి రత్నభారతి, ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, బిఆర్‌కే కాలేజీ కరస్పాండెంట్ ఏవి ప్రసాద్, ఐవి సత్యవతి, కోఆర్డినేటర్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : గత వారం రోజులుగా అనగా ఈ నెల 3 నుండి 9వ తేదీ వరకు రేగుపాలెం గ్రామంలో శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 వారు నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం మంగళవారం ముగిసింది. ముగింపు రోజున ఉదయం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వివిధ ఆటలు, పాటల పోటీలలో గెలుపొందిన ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రేఖ రామారావు, రేగుపాలెం గ్రామ సర్పంచ్ ఆర్ మహాలక్ష్మి అధ్యాపకులు వి చిట్టిబాబు, ఎం కిషోర్, చిరంజీవి పాల్గొన్నారు.

ఆరో రోజుకు ఎన్ఎస్ఎస్ శిబిరం

పాయకరావుపేట : స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం, అరట్లకోట ఆరో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంఇఒ-2 జి.రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి పి.భాస్కరరావు, సర్పంచ్ పి.అప్పలనరస, వేముల వెంకటేశ్వరరావు, కట్టా శ్రీను, తుమ్మల గణేష్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-సబ్బవరం : రైతులు ఆధునిక వ్యవసాయ యాజమాన్య పద్ధతులను ఆచరించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.ఆశాదేవి అన్నారు. మండలంలోని అమృతపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం పంట పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. రబీ సీజన్‌కు అవసరమయ్యే విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, ధాన్యం రైతులకు సొమ్మును 24 గంటల్లో చెల్లించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బైలపూడి గౌరీ రామారావు, ఎంపిటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏఈఓ బాలరాజు, విహెచ్ఎ భావన, విఎఎలు రేణుక, అలేఖ్య, రైతులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్క్రబ్ టైఫస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సాంబశివరావు అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విద్య, ఐసిడిఎస్, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య, వెలుగు, నరేగా తదితర శాఖల అధికార్లు, పంచాయతీ కార్యదర్శిలతో స్క్రబ్ టైఫస్‌పై అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. చౌడువాడ, లంకవానిపాలెం పిహెచ్‌సిల వైద్యులు డాక్టర్ రామ్ చరణ్, డాక్టర్ శశిప్రియాంకలు స్క్రబ్ టైఫస్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రమణి, ఎంఇఒ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి టికెట్ రిజర్వేషన్ బోర్డింగ్ ఏర్పాటుకు పరిశీలన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : అడ్డరోడ్డు జంక్షన్‌లో దూర ప్రాంత బస్సులకు టికెట్ రిజర్వేషన్ బోర్డింగ్ ఏర్పాటు కోసం అనకాపల్లి ఆర్టీసీ బస్సు స్టేషన్ మేనేజర్ పీలా చంద్రశేఖరరావు మంగళవారం పరిశీలన చేశారు. ఈ నెల 6న రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొరుప్రోలు గ్రామానికి చెందిన ముత్తా గోవిందరావు అడ్డురోడ్డులో టికెట్ రిజర్వేషన్ బోర్డింగ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. నర్సీపట్నం, కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం తదితర మండలాలకు చెందిన వారు హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, శ్రీశైలం, మార్కాపురం, భద్రాచలం వంటి దూరప్రాంతాలకు వెళ్లేందుకు అడ్డరోడ్డు నుండి కాకుండా అనకాపల్లి నుండి టికెట్ రిజర్వేషన్ తీసుకోవాల్సి వస్తుందని, దీని వల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురి కావడమే కాకుండా ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తోందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి అనిత సమస్య పరిష్కారం కోసం ఆర్టీసీ అధికారులను ఆదేశించగా, స్థల పరిశీలన చేసి విశాఖ ఆర్టీసీ అధికారులకు సమస్య పరిష్కారానికి నివేదించనున్నట్లు అనకాపల్లి ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ పీలా చంద్రశేఖరరావు తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో గల దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. దిబ్బిడి జెడ్‌పి హైస్కూల్ క్లస్టర్ పరిధిలోని 15 పాఠశాలలకు ఆట వస్తువులను ప్రభుత్వం మంజూరు చేసింది. వాలీబాల్, వాలీబాల్ నెట్‌లు, క్రికెట్ బ్యాట్లు తదితర వస్తువులతో కూడిన కిట్లను ప్రధానోపాధ్యాయులు సత్యారావు ఆయా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో సిఆర్పి జి.శ్రీను, పీడీలు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నాగులపల్లి గ్రామంలో ఈనెల 13వ తేదీన జరుగు గౌరీ పరమేశ్వరుల మహోత్సవం పోస్టర్‌ను మంగళవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అచ్చుతాపురం ఎస్‌టిబిఎల్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని అరట్లకోట ఎస్సీ కాలనీలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మలకా నూకయ్యకు చెందిన తాటాకుల ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో నూకయ్యకు చెందిన వస్తువులు కాలి బూడిదయ్యాయి. కట్టు బట్టలతో మిగిలాడు. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి మంగళవారం అరట్లకోట విచ్చేసి నూకయ్యను పరామర్శించారు. నూకయ్యకు రూ.5000 వేలు ఆర్థిక సహాయం, 25 కేజీలు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గెడ్డం చైతన్య, యాగదాసు నానాజీ, తుమ్మల గణేష్, టీడీపి నాయకులు కట్టా శ్రీను, నడిగట్ల వరప్రసాద్, కంకిపాటి సుబ్బారావు, కుందూరు కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న కూటమి నాయకులు

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

రావికమతంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, స్థానిక వైద్యాధికారులు, మండల స్థాయి అధికారులతో కలిసి స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, వ్యాప్తి విధానం, జాగ్రత్తలు పై చర్చించి గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పొదలు, గడ్డి ప్రాంతాల్లో వ్యాధికి కారణమైన పురుగు అధికంగా ఉండటంతో ప్రతి గ్రామంలో జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులు తెలిపారు.

రావికమతం: స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మహేష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో మహేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రావికమతం మండల పిహెచ్సి వైద్యాధికారులు సురేఖ, డి.నళిని పుష్పలత, శ్రీనివాసు, మండల విద్యాశాఖ అధికారులు, అంగనవాడి, సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు మాట్లాడుతూ, ఈ వ్యాధిలో జ్వరం, తలనొప్పి, వంటి నొప్పులు, శరీరంపై దద్దుర్లు, కండ్ల కలక వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి అంటువ్యాధి కాదని ఒకరి నుండి ఒకరికి వచ్చే అవకాశమే లేదన్నారు. ఈ జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ హాస్పిటల్లో రక్తపరీక్ష చేయించుకుని వ్యాధి నిర్ధారణ చేసిన తదుపరి చికిత్స ప్రారంభిస్తే ఈ వ్యాధి భారీ నుండి బయటపడవచ్చు అన్నారు. జ్వరంతో బాధపడుతూ వస్తున్న రోగులు ఎవరైనా ఆసుపత్రికి వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎంపిడిఓ మహేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

న్యూమోనియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి: రావికమతం:కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో న్యుమోనియాపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యుమోనియా ఎవరికైనా రావచ్చు అని, కొద్ది మంది పిల్లలకు ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. పిల్లలకు తల్లిపాలు తొలి ఆరు నెలలు పూర్తిగా ఇవ్వాలన్నారు. ముందస్తుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకున్నట్లయితే ఈ వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చునని ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గోవిందు, ఫార్మసిస్ట్ స్టాఫ్ నర్స్ యమున, పద్మ, మహేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒగా వర్మ

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గ్రామ, వార్డు సచివాలయాల డిప్యూటీ ఎండీవోగా పి.వి.వి వర్మ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ, రావికమతం మండలంలో ఉన్న 22 సచివాలయాల పనితీరు మెరుగ్గా ఉండేవిధంగా, అన్ని శాఖల అధికారుల పనితీరు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు నేరుగా అందే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడైనా ఎటువంటి సమస్యలు తలెత్తినా తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. మండలంలో గల ప్రజా ప్రతినిధులు,సచివాలయాల సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు.

నూతన పింఛన్ల మంజూరుపై

మండల సమావేశంలో వాగ్వాదం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి గజ్జలపు మణికుమారి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశం మొదటి నుంచి వాడీవేడిగా సాగింది. సమావేశం ప్రారంభంలోనే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని ఇరు పార్టీ నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. సర్పంచ్లు రఘురామ్, నల్లబెల్లి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలపై నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డివెంకటరమణ, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చిటికెల సాంబమూర్తి వివరణ ఇచ్చారు. తాము ఎవరి పింఛన్లను అన్యాయంగా తొలగించలేదని బుదులిచ్చారు. అనంతరం మండలంలోని వివిధ సమస్యలను సభ్యులు లేవనెత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, చోద్యం కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ చిటికెల సాంబమూర్తి, వైస్ ఎంపిపిలు సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి, ఎంపిటిసిలు, సర్పంచ్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి మణికుమారి

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి -మాడుగుల: మండలంలోని సాగరం కాలనీలో మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరం నాలుగవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యువతకు విద్యార్థులకు కళాశాల సీనియర్ అసిస్టెంట్ షేక్ సులేమాన్ నానాటికి పెరుగుతున్న సైబర్ నేరాలను అదుపు చేయడంలో భాగంగా సైబర్ సెక్యూరిటీ గురించి అవగాహన కల్పించారు. ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ సన్యాసినాయుడు, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ,ఎం ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. రాంకుమార్ యువత విద్యార్థులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న బాబ్జి కుటుంబ సభ్యులు

సూర్యారావుకు సత్కారం

ప్రజాశక్తి-నక్కపల్లి:తిరుమలకు 10వసారి పాదయాత్రతో వెళుతున్న పిల్లి సూర్యనారాయణ (71) ను మండలంలో కాగిత గ్రామానికి చెందిన పోతంశెట్టి బాబ్జి సత్కరించారు. విశాఖపట్నం నుండి పిల్లి సూర్యనారాయణతో పాటు పలువురు వెంకటేశ్వర స్వామి మాల ధారణ స్వీకరించి, వెంకన్నను దర్శించుకునేందుకు పాదయాత్ర చేసుకుంటూ తిరుమల బయలుదేరారు. పోతంశెట్టి బాబ్జి ఆహ్వానం మేరకు మండలంలో చినదొడ్డిగల్లు గ్రామంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు నివాసం వద్ద వీరంతా ఆతిథ్యం స్వీకరించారు. ఈ మేరకు సూర్యనారాయణ ను పోతంశెట్టి బాబ్జి కుటుంబ సభ్యులు శాలువాతో సత్కరించారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

మాడుగులలో పండ్లను ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి- మాడుగుల:అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు, యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ జన్మదిన వేడుకలు మాడుగుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పడాల కొండలరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మోదకొండమ్మ, దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సెంటెన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పళ్ళు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన అధ్యక్షుడు యేసు రాజు, మాజీ జడ్పిటిసి భీమరశెట్టి భవాని, పాతరపల్లి రాంబాబు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు మంగళవారం అనకాపల్లిలో ఘనంగా జరిగాయి. పార్టీ నియోజక వర్గం సమన్వయకర్త మలపురెడ్డి కోటేశ్వరరావు, సీనియర్ నేతలు పిఎస్.దత్తు, తుట్ట రమణ, కత్తెర శ్రీధర్, కాళ్ళ వెంకట సత్యనారాయణ, కట్టుమూరి నూక అప్పారావు, సేనాపతి ఈశ్వరరావు, మడేపు నాయుడు, బుద్ద కిషోర్, బోయిన బాలమురళి, కాపారపు సత్యనారాయణ, గున్నబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు విశాఖ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మరాజు (హాసిని వర్మ) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సోనియా గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హాసిని వర్మ రాజు మాట్లాడుతూ, సోనియా గాంధీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్ త్రినాథ్, జివివి.కమలాకర్, కాండవ గాయత్రి, వి.ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ

కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రమైన మాడుగుల దొర్ల వీధిలో మంగళవారం రోడ్డుపై వెళుతున్న ప్రజలపై కుక్కలు దాడి చేసాయి. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. గాయపడిన వారిని వెంటనే మాడుగుల సిహెచ్సికి తరలించారు.

ఎస్ఐని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట ఎస్సైగా ఇటీవల నూతనగా బాధ్యతలు స్వీకరించిన రిషికేశ్వరరావును సీహెచ్.నాగాపురం టీడీపీ నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, బొప్పన ప్రసాద్, ఎర్ర మురళీ, దుంపలపూడి వెంకటరమణ, నడిశెట్టి గణేష్, సేనాపతి వరహాలబాబు, జైతు అప్పారావు పాల్గొన్నారు. కృష్ణదేవిపేట ఎస్సైను ఏఎల్.పురం మేజర్ పంచాయతీ సర్పంచ్ లోచల సుజాతతో పాటు గ్రామ వైసీపీ పార్టీ అధ్యక్షులు చిటికెల వివేకానంద నాయుడు, కుండల పెదబాబులు కలిశారు. ఈ కార్యక్రమంలో కన్నూరు రాజబాబు, తామరపల్లి శివ, కళ్ళ సత్తిబాబు, మజ్జి సత్యనారాయణ, బంగారు కృష్ణ, కోలంకి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని అభినందిస్తున్న నాయకులు

కాలనీలకు తాగునీరు సరఫరా

నీటిని పట్టుకుంటున్న మహిళలు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కొత్తకోట అరుంధతి, అంబేద్కర్ కాలనీకి మంగళవారం వాటర్ ట్యాంకర్ ద్వారా మంచినీటిని సరఫరా చేశారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా, తగు చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు ఎంపీడీవో మహేష్ ఆదేశించారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ

వరిలో రెల్లురాల్చు పురుగును నియంత్రించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: వరిలో రెల్లురాల్చు పురుగును నియంత్రించాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా డొంకాడ, గొడిచెర్ల గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వరి పొలాలను సందర్శించారు. కోత దశకు చేరుకున్న వరి, కోతలను పరిశీలించారు.వరి గింజ గట్టి పడే దశలో రెల్లురాల్చు పురుగు నియంత్రణ చర్యలు గురించి రైతులకు వివరించారు. అపరాలు వేసుకోవాలని రైతులకు సూచించారు. పీఎం కిసాన్‌కు అర్హత ఉండి , లబ్ధి పొందని రైతుల పేర్లను నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సత్యనారాయణ, జ్యోస్న, ఆర్ ఎస్ కె సిబ్బంది నాగేశ్వరావు, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న అధికారులు

శ్రీనివాసరావుకు సత్కారం

ప్రజాశక్తి-గొలుగొండ: ఏపీ ఎన్జీవోస్ నర్సీపట్నం తాలుకా జాయింట్ సెక్రటరీగా ఏఎల్.పురం పంచాయతీ కార్యదర్శి కే.శ్రీనివాసరావు ఇటీవల ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎంపిడిఒ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఘనంగా సత్కరించారు.

స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-రోలుగుంట: ప్రభుత్వం మంజూరు చేసే ఉచిత ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని రోలుగుంట తహశీల్దార్ నాగమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 24 పంచాయతీల్లో అర్హులై ఉండి ఇళ్ల స్థలాలు కావాల్సిన వారు తమ ఆధార్, రేషన్ కార్డుతో పాటు పాస్ పోర్టు సైజు ఫొటోతో గ్రామ సచివాయాల్లో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే సిబ్బందితో క్షేత్ర స్థాయిలో అర్హుల గుర్తింపుకు సర్వే చేపట్టామన్నారు.

చలితో వణుకుతున్న గిరిజనం

-అరకు వ్యాలీలో 4.7 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు మన్యంలో మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటతో చలి అధికంగా ఉండడంతో మన్యం వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలితో పాటు తెల్లవారుజాము నుంచి తొమ్మిది, పది గంటల వరకు మంచు దట్టంగా కురుస్తోంది. చలి బారి నుంచి శరీరాన్ని కాపాడుకోవడానికి ఉన్ని దుస్తులు ధరించడం, చలి మంటలను ఆశ్రయించడం జరుగుతుంది. ఉదయం వేళల్లో దట్టంగా పొగ మంచు కమ్మేస్తుండటంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి చలి గాలులు వీస్తుండడంతో మన్యం వాసులు గజగజలాడుతున్నారు. రాత్రి వేళల్లోనూ పొగ మంచు దట్టంగా కురుస్తోంది. మంగళవారం అరకు వ్యాలీలో 4.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, డుంబ్రిగూడలో 5.7, జి.మాడుగులలో 5.5, హుకుంపేటలో 6.9, ముంచింగిపుట్టులో 5.9, చింతపల్లిలో 6.0, పాడేరులో 6.7, పెదబయలులో 7.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

హెటిరో సౌజన్యంతో

స్టడీ మెటీరియల్, ప్రోత్సాహక నగదు అందజేత

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు, నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి: విద్యార్థులు విద్యలో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హెటిరో కంపెనీ సి ఎస్ ఆర్ ప్రతినిధి ఎన్ సుధాకర్, అరుణ్ కుమార్ రెడ్డి అన్నారు. హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి ఆదేశాలు మేరకు, కంపెనీ ఆర్థిక సౌజన్యంతో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని మండలంలో మంగళవారం వేంపాడులో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిఎస్ఆర్ ప్రతినిధి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని పెట్టుకుని, దాని సాధనకు కృషి చేయాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండా చదువుకునేందుకు కేటాయించాలని, పదవ తరగతి పరీక్షలు ముగిసే వరకు కష్టపడి చదివి, మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఎంఈఓ కె నరేష్ మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో హెటిరో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం సిఎస్ఆర్ ప్రతినిధులు, గ్రామ సర్పంచ్ వై.నూకరత్నం, ఉపసర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు కుంచే మధు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు అయినంపూడి మణిరాజు, ఎంఈఓలు నరేష్, నాగన్న దొర, సీనియర్ ప్రధానోపాధ్యాయులు వేమగిరి నూకరాజు, వేంపాడు హైస్కూల్ హెచ్ఎం వరలక్ష్మి చేతుల మీదుగా రూ.4 లక్షలు విలువైన స్టడీ మెటీరియల్‌లను మండలంలో 1200 మంది విద్యార్థులకు అందజేశారు.

షైనింగ్ స్టార్ లకు నగదు ప్రోత్సాహకం..

మండల స్థాయిలో అన్ని ఉన్నత పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన 41 మంది విద్యార్థులకు 4 లక్షలు నగదు ప్రోత్సకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ ఆర్ ప్రతినిధి శ్రీనివాస్, కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్‌న ఇస్తున్న అధికారులు

పారా ఒలింపిక్స్‌లో విద్యార్థిని సత్తా

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగంపేట ఉన్నత పాఠశాల దివ్యాంగ విద్యార్థికి అనకాపల్లి జిల్లా పారా ఒలింపిక్స్ 400 మీటర్స్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ జిల్లా అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, డిప్యూటీ డిఈఓ పి.అప్పారావు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త, రామకృష్ణనాయుడు చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు నాగభూషణం దివ్యాంగ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో మరెన్నో బహుమతులు తెచ్చుకోవాలని తెలియజేశారు. అదే విధంగా ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం కూడా దివ్యంగా విద్యార్థులకు వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, మంచి శిక్షణ ఇస్తున్నారని ప్రశంసించారు. ఐఈఆర్‌పి అజిమత్, రమణి, దివ్యాంగ విద్యార్థిని అభినందించారు.

ఒలింపిక్స్ పతకాలు సాధించేలా ప్రగతి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : అంతర్జాతీయ స్థాయిలో ఒలింపిక్స్ పతకాలు సాధించేలా క్రీడాకారులు తమ ప్రతిభతో రాణించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆకాంక్షించారు. ప్రతిష్టాత్మకంగా విశాఖ వేదికగా నిర్వహిస్తున్న 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్రతతో, నీతివంతంగా తమ పోటీలో పాల్గొనాలని సూచించారు. భవిష్యత్తును బంగారు అక్షరాలతో లిఖించుకోవాలన్నారు. జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ బాగా ఆడి, ఉత్తమ స్థాయికి ఎదగాలని స్కేటర్లను ప్రోత్సహించారు. విఎంఆర్‌డిఏ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ, క్రీడలకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ రాష్ట్రం అత్యుత్తమ క్రీడా పాలసీని అమలు చేస్తోందని, క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషనతో ఉద్యోగాలను సైతం అందించామని గుర్తు చేశారు. ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలకు విశాఖ వేదిక కావాలని ఆకాంక్షించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ, ముడసర్లోవలో ఒక కొత్త స్కేటింగ్ రింగ్‌ను నిర్మిస్తామన్నారు. అనంతరం అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారుడు ఆనంద్ కుమార్‌ను అతిథులు సత్కరించి, నగదు పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎపి రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.సుధాకర రెడ్డి, ఆర్ఎస్ఎఫ్ఐ కార్యదర్శి డాక్టర్ డి.భగీరథ్, ఎపి రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ థామస్ చౌదరి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శీలం లక్ష్మణ్, యార్లగడ్డ రవి పాల్గొన్నారు.

పది, ఇంటర్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న అన్ని వసతి గృహాలలో విద్యార్థుల హాజరు, పరీక్షల ముందస్తు ప్రణాళిక, మౌళిక సదుపాయాలు, విద్యాప్రమాణాల మెరుగు పరచుటకు తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గిరిజన, సాంఘిక, బిసి సంక్షేమ, రెసిడెన్షియల్ స్కూల్స్, కెజిబివి, ఇంటర్మీడియట్, పాఠశాల విద్యాశాఖ అధికారులతో కలిసి జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అన్ని సంక్షేమ వసతి గృహాల అధికారులతో ఈ వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో వసతిగృహాలలో గల విద్యార్థులు అందరూ పరీక్షలలో ఉత్తీర్ణులు అయ్యేలా చదివించాలన్నారు. 100 రోజులు కార్యాచరణ ప్రణాళిక అమలుచేయాలని సూచించారు. పబ్లిక్ పరీక్షలు ముగిసేవరకు విద్యార్థులు అందరూ వసతిగృహాలలోనే ఉండాలని, పరీక్షలకు సన్నద్ధంకావాలని, పరీక్షలు పూర్తయిన పిదపమాత్రమే ఇంటికి పంపించాలని ఆదేశించారు. విద్యార్థుల రక్షణ, సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాలికల హాస్టలులోనికి సిబ్బంది తప్ప ఇతరులకు ప్రవేశం అనుమతించకూడదన్నారు. విద్యార్థులకు రక్షిత మంచినీరు, నాణ్యమైన భోజనం, నిరంతర వైద్యపరీక్షలు అందించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శద్ధ తీసుకొని సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ అందించాలని ఆదేశించారు. మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి జి. అప్పారావు నాయుడు, జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి జి వినోద్ బాబు, జిల్లా బిసి, సాంఘిక, గిరిజన సంక్షేమ అధికారులు కె.శ్రీదేవి, బి.రామనాథం, జి.మంగవేణి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

11న నూతన ఎంపిపి ఎన్నిక

రాజాన శేషు

ప్రజాశక్తి-యలమంచిలి : ఎట్టకేలకు యలమంచిలి నూతన ఎంపిపి ఎన్నిక తేదీ ఖరారైంది. ఈ నెల 11 తేదీ గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నిక ప్రక్రియ ప్రారంభమౌతుందని ఎంపిటిసిలకు ఎన్నిక ప్రిసైటింగ్ ఆఫీసర్‌గా నియమించబడిన మండల స్పెషల్ ఆఫీసర్ పికెటి ప్రసాద్ శనివారం నోటీసులు జారీ చేశారు. ఓటు హక్కుగల ఆరుగురు సభ్యులతో పాటు ఆహ్వానితులుగా అనకాపల్లి ఎంపీ సిఎం రమేశ్, యలమంచిలి ఎంఎల్ఏ విజయకుమార్, కో-ఆప్షన్ సభ్యులు సిద్ధా నూకేశ్వరరావులకు సమావేశానికి హాజరు కావాలని సమాచాచం ఇచ్చారు. ఏడుగురు సభ్యులు గల మండల పరిషత్‌లో ఏటికొప్పాక-2 ఎంపిటిసి నగిరెడ్డి దేముడమ్మ మరణించారు. మిగిలిన ఆరుగురు సభ్యుల్లో నలుగురు మాజీ ఎంపిపి బోదెపు గోవిందరావుపై అవిశ్వాసం ప్రకటించడంతో వైస్ ఎంపిపి -1 రాజాన సూర్యచంద్రశేషగిరిరావును ఇన్‌ఛార్జి ఎంపిపిగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత ఎంపిపిని బలపరుస్తూ ఆయనతో పాటు మరో ముగ్గురు నగిరెడ్డి అమ్మాజీ (ఏటికొప్పాక-1), బర్రె శివలక్ష్మి (కొత్తలి), శిలపరశెట్టి ఉమ (జంపపాలెం) ఉన్నారు. మిగిలిన ఇద్దరు ఎంపిటిసిలు మాజీ ఎంపిపి బోదెపు గోవిందరావు (పులపర్తి), పూటకూటి రామగణేశ్ (బయ్యవరం) ఉన్నారు. వీరిద్దరూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటారో లేదోతెలియదు. జనసేన వర్గీయులు మాత్రం ఎన్నిక ప్రక్రియ నామమేత్రమేనని చెబుతున్నారు. ఇప్పటికే మెజారిటీ ఎంపిటిసిలతో ఇన్‌ఛార్జి ఎంపిపి పదవిలో కొనసాగుతున్న రాజాన సూర్యచంద్రశేషగిరిరావు పూర్తికాల ఎంపిపిగా ఎన్నికవుతారని అంతా భావిస్తున్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వన సమారాధన

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి మండలం లైన్ కొత్తూరు వద్ద అగ్రిగోల్డ్ సైట్‌లో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కూటమి కుటుంబ సభ్యుల వన సమరాధన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త తన సోదర సమానుడని, వారికి కావాల్సిన పనులు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సుందరపు సతీష్ కుమార్, పిల్ల రమాకుమారి, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.